నమస్తే తెలంగాణ
నాగర్‌కర్నూల్
5 | మహబూబ్‌నగర్, శుక్రవారం 22 డిసెంబర్ 2023 | NAGARKURNOOL

మద్దిమడుగులోనిప బ్బతిఆ ంజనేయస్వామి ఆలయం

బ్రహ్మోండోత్సవం

- నేటి నుంచి మద్దిమడుగులో ఉత్సవాలు
- కోరిన కోరికలు తీర్చే అంజన్నగా గుర్తింపు
- 26 వరకు గాయత్రి మహాయజ్ఞం నిర్వహణ
- వేడుకలకు ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు
- నల్లమలలో మార్మోగనున్న హనుమాన్ నామస్మరణ

ఆంజనేయస్వామి మూలవిరాట్

అమ్రాబాద్, డిసెంబర్ 21 : తెలంగాణలోని పవిత్ర పుణ్యక్షేత్రాల్లో ఒకటి మద్దిమడుగు ఆంజనేయస్వామి దేవస్థానం. నాగర్‌కర్నూల్ జిల్లాలోని శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారిలో మన్ననూర్ నుంచి 52 కిలోమీటర్ల దూరంలో నల్లమల అటవీప్రాంతంలో మద్దిమడుగు అంజన్న ఆలయం ఉన్నది. పచ్చదనపు ప్రదేశాలకు నిలయమైన నల్లమల కొండల్లో ప్రవహించే కృష్ణానది, ఉత్తర వాహినిగా పచ్చిమ భాగమున దుందుభీనది సంగమించి రెండు నదుల కలయిక నడుమ ప్రదేశానికి 12 కిలోమీటర్ల దూరంలో ప్రకృతి రమణీయ దృశ్యముల మధ్య ప్రకృతి ఒడిలో సహజంగా వెలిసిన మద్దిమడుగు పుణ్యక్షేత్రానికి కృష్ణానది ఒక ఆభరణం లాంటిది.

కోట మైసమ్మ అమ్మవారు..

ఆంజనేయస్వామి ఆలయం పక్కనే కోటగోడకు వెలిసిన అమ్మవారిని కోటమైసమ్మగా భక్తులు పిలుచుకుంటారు. అత్యంత మహిమాన్విత శక్తిక్షేత్రంగా కోటమైసమ్మ అమ్మవారు అగ్రస్థానాన్ని వహిస్తున్నది. ప్రతి ఆదివారం భక్తులు అధికసంఖ్యలో ఆలయాన్ని దర్శించుకొంటారు. సహస్ర కోటి నామాలతో పిలుపును అందుకుంటున్న జగన్మాత పంచేంద్రియాలను నిగ్రహిస్తూ పంచభూతాత్మకమైన శరీరాన్ని భరిస్తూ ప్రకృతి శక్తులను నియంత్రిస్తూ కలియుగంలో దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ చేయడానికి ఈ క్షేత్రంలో కోటమైసమ్మ అమ్మవారిగా వెలిసింది.

హనుమాన్ మాలధారణ..

హనుమాన్ మాలధారణ ఏడాదిలో రెండు పర్యాయాలు చైత్రమాసం, కార్తీక మాసం నెలల్లో అర్ధమండలం (21 రోజులు), మండలం (41 రోజులు) దీక్ష చేపట్టి ఇరుముడితో మద్దిమడుగు చేరుకొని స్వామివారికి ఇరుముడులు సమర్పిస్తారు.

పూజా కార్యక్రమాల వివరాలు..

➪ మద్దిమడుగు ఆంజనేయస్వామి ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం నిత్యార్చన విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, పంచగవ్యం, యాగశాల ప్రవేశం, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, ధ్వజారోహణం, ఊష్ణవాహనసేవ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు.

➪ 23న (శనివారం) ఉదయం విఘ్నేశ్వరపూజ పంచగవ్యం, వాస్తుపూజ హోమం, రుద్రహోమం, స్వామి వారి సహస్రనామార్చన, బలిహరణ, నీరాజన మంత్రపుష్పం, సాయంత్రం నిత్యోపాసన మన్యుసూక్త హోమం, బలిహరణ తీర్థప్రసాద వితరణ, రాత్రికి అశ్వవాహనసేవ నిర్వహిస్తారు.

➪ 24న (ఆదివారం) ఉదయం విఘ్నేశ్వరపూజ, రుద్రహోమం, నిత్యోపాసన బలిహరణ, మహానివేదన నీరాజనం, మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం, హనుమాన్‌వ్రతం,మధ్యాహ్నం నిత్యోపాసనామాలు, బలిహరణ, రాత్రికి పార్వతీ పరమేశ్వరుల కల్యాణమహోత్సవం, మంగళహారతి, గజవాహనసేవ నిర్వహిస్తారు.

➪ 25న (సోమవారం) ఉదయం విఘ్నేశ్వరపూజ, రుద్రహోమం, నిత్యోపాసన బలిహరణ, మహానివేదన నీరాజనం, మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం, రాత్రికి సీతారాముల కల్యాణమహోత్సవం, గరుఢవాహనసేవ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. అదేవిధంగా రాత్రి 9:30 గంటలకు హనుమాన్ మహాపడిపూజ కార్యక్రమం హనుమాన్ మాలధారుల సమక్షంలో అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తారు.

➪ 26న (మంగళవారం) ఉదయం గవ్యంతరపూజలు, మన్యుసూక్తములతో పాటు ఆంజనేయస్వామివారికి 108 కలశాలతో మహాకుంభాభిషేకం నిర్వహిస్తారు. అనంతరం హనుమాన్ గాయత్రి మహాయజ్ఞం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహిస్తారు.

➪ హనుమాన్ మాలధారణ చేపట్టిన భక్తులు (స్వాములు) 22 నుంచి 26వ తేదీ వరకు మాల విరమణ కార్యక్రమాలు స్వామివారి సన్నిధిలో నిర్వహిస్తారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి

శుక్రవారం నుంచి ఐదు రోజులపాటు జరిగే మద్దిమడుగుపబ్బతి ఆంజనేయస్వామి మాలవిరమణ,గా యత్రి మహాయజ్ఞఉ త్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు తాగునీటి సౌకర్యం, విడిది, దర్శనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. భక్తులు అధికసంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కావాలి.

- రంగాచారి, ఈవో, మద్దిమడుగు ఆంజనేయస్వామి ఆలయం

దొడగుంటపల్లిలో అయ్యప్ప నామస్మరణ

- పడిపూజలో పాల్గొన్న మాజీ మంత్రి సింగిరెడ్డినిరం జన్‌రెడ్డి

దొడగుంటపల్లిలోఅయ్య ప్పస్వామికి పూజలు చేస్తున్న మాజీమ ంత్రిని రంజన్‌రెడ్డి

పెద్దమందడి, డిసెంబర్ 21 : మండలంలోని దొడగుంటపల్లిలో గురువారం అయ్యప్పస్వామి మహాపడిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గురుస్వామి చెన్నారెడ్డి ఆధ్వర్యంలో రమేశ్‌శర్మ, పవన్‌శర్మ, చిట్యాల నరేందర్ గురుస్వామిల సమక్షంలో మహాపడిపూజ నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమానికి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలు పాడిపంటలతో కళకళలాడాలని, గ్రామస్తులంతా సుఖసంతోషాలతో జీవించాలని వేడుకున్నట్లు చెప్పారు. అనంతరం అయ్యప్ప, ఆంజనేయస్వామి మాలధారులు, గ్రామస్తులకు భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు అశోక్‌రెడ్డి, వెంకటేశ్, సాయికుమార్, ఆంజనేయులు, చంద్రశేఖర్‌రెడ్డి, సంతోష్, నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్ఎన్ఆర్ @ రూ.3,289

జడ్చర్ల, డిసెంబర్ 21: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో గురువారం ఆర్ఎన్ఆర్‌కు క్వింటా రూ.3,289 ధర పలికింది. 1,810 క్వింటాళ్ల ఆర్ఎన్ఆర్ రకం ధాన్యం అమ్మకానికి రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ.3,289, కనిష్ఠంగా రూ.2,176, మధ్యస్తంగా రూ.3,209 ధర పలికింది. 82 క్వింటాళ్ల హంసధాన్యానికి క్వింటాకు గరిష్ఠంగా రూ.2,168, 18 క్వింటాళ్ల చిట్టిముత్యాలు రకం ధాన్యానికి క్వింటాకు గరిష్ఠంగా రూ.3,309 ధర పలికింది. అదేవిధంగా 81 క్వింటాళ్ల మొక్కజొన్న అమ్మకానికి రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ.2,295, కనిష్ఠంగా రూ.2,295, మధ్యస్తంగా రూ.2,295 ధర లభించింది. అలాగే 126 క్వింటాళ్ల వేరుశనగ అమ్మకానికి రాగా గరిష్ఠంగా రూ.7,969 ధర పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

క్వింటాకు రూ. 12 వేలు ఇవ్వాలి

రైతులు పండించిన పత్తికి క్వింటాకు రూ.12 వేల ధరను ప్రభుత్వం ఇవ్వాలి. నాకున్న పదెకరాలలో పత్తిని సాగు చేశాను. పంట పూర్తిగా దెబ్బతిన్నది. దిగుబడులు బాగా తగ్గాయి. ఎకరాకూ 3 నుంచి 5 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. ధరలను చూస్తే ఈ సారి పంట సాగుకు పెట్టిన ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ప్రభుత్వ మద్దతు ధర రూ.7,020 కూడా రావడం లేదు. మొత్తం 90 బస్తాలు తీసుకొస్తే 80 బస్తాలకు క్వింటా రూ.6,260 ధర వచ్చింది. మరో 10 బస్తాలకు క్వింటాకు రూ.5,400 మాత్రమే దక్కింది. ఎంతో కష్టపడి పండించిన పంటలకు ధరలు లేకపోవడంతో అప్పులపాలు కావాల్సి వస్తుంది. గతేడాది క్వింటాకు రూ.9 వేల కుపైగానే ధర పలికింది. ఈ సారి కూడా ధరలు బాగొస్తాయన్న ఉద్దేశంతో పత్తిని సాగు చేస్తే నిరాశే ఎదురైంది. ప్రస్తుత మార్కెట్‌లో ధరను చూస్తే భయమేస్తున్నది. బుధవారం జడ్చర్ల మార్కెట్‌కు తీసుకొస్తే రూ.6,260 ధర వచ్చింది. ఇలా అయితే అప్పులు ఎలా తీర్చాలో.. సర్కారు మద్దతు ధరను పెంచాలి.

– మల్లేశ్, రైతు, భిల్లాఘణపురం మండలం

పత్తి రైతు చిత్తు

- వన్నె తగ్గిన తెల్లబంగారం
- పత్తికి మద్దతు ధర కరువు
- రోజురోజుకు పడిపోతున్న రేటు
- ప్రస్తుతం క్వింటాకు రూ.6 వేలే..
- గతేడాది క్వింటా రూ.9 వేలకుపైనే..
- ఆందోళన చెందుతున్న రైతులు

జడ్చర్ల, డిసెంబర్ 21 : తెల్లబంగారానికి వన్నె తగ్గింది. గతేడాదికన్నా రేటు భారీగా పడిపోవడంతో పత్తి రైతు చిత్తవుతున్నాడు. కనీసం మద్దతు ధరలు కూడా దక్కడం లేదు. దీంతో కర్షకులు ఆందోళన చెందుతున్నారు. మార్కెట్‌లో కొనేందుకు వ్యాపారస్తులు ఆసక్తి చూపకపోవడంతో ధరలు రోజురోజుకూ తగ్గుతున్నాయి.

మద్దతు కరువు..

మార్కెట్‌లో పత్తికి మద్దతు ధర కరువైంది. ఆశించిన స్థాయిలో రేటు దక్కకపోవడంతో రైతులకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. ఆరుగాలం కష్టించి పండించిన పత్తి రైతులకు ప్రతిఏడాది కన్నీళ్లే మిగులుతున్నాయి. ఓవైపు ప్రకృతి, మరోవైపు వ్యాపారులు ఇద్దరి మధ్యలో కర్షకులు నలిగిపోతున్నారు. వ్యవసాయమే జీవనంగా కొనసాగిస్తున్న రైతు ఒక ఏడాది పంటలు పండకపోయినా మళ్లొచ్చే ఏడాదైనా పండుతాయన్న నమ్మకంతో పంటలు వేస్తున్నాడు. కానీ మద్దతు ధర దక్కకుంటే ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు. అదే వ్యాపారం విషయానికొస్తే ఒక్కసారి నష్టం వాటిల్లితే దాన్ని తొలగించి మరో బిజినెస్ చేసుకునే వెసులుబాటు ఉన్నది. కానీ రైతుల పరిస్థితి అందుకు భిన్నంగా ఉంటుంది. వ్యవసాయం తప్పా ఇతర పనులు రాని రైతులు దాన్నే నమ్ముకుని జీవిస్తున్నారు. ఈ ఏడాది వానకాలం సీజన్‌లో తొలకరి వర్షాలు కురవడంతో కోటి ఆశలతో రైతులు పంటలు సాగు చేపట్టారు. దుక్కి దున్నడం మొదలు.. విత్తనాలు విత్తి.. ఎరువులు వేసి, మందులు పిచికారీ చేసి ఆరుగాలం కష్టించి పండించిన పంటను అమ్ముకుందామంటే తీరా మార్కెట్‌లో ధరలు అంతంతే.. అక్కున్న వ్యాపారులు వేసిందే ధర దీంతో కర్షకులు దిగాలు చెందుతున్నారు. ఇలా పత్తి రైతుకు ప్రకృతితో పాటు ధరలు రాక నష్టపోతున్నారు.

క్వింటాకు రూ.6 వేలే..

ఈ ఏడాది మొదట్లో రూ.7 వేలకు పైచిలుకు పలికిన పత్తి ధరలు రోజురోజుకూ పడిపోతూనే వచ్చాయి. ప్రస్తుతం క్వింటా రూ.6 వేలు లభిస్తుండగా.. గతేడాది కంటే పూర్తిగా పడిపోయాయి. పోయినసారి వానకాలం సీజన్ ప్రారంభంలో క్వింటాకు రూ.9 వేలకు పైచిలుకు ధరలు రాగా.. ఈ సారి సీజన్ ప్రారంభంలో క్వింటాకు కేవలం రూ.7,295 ధరలు మాత్రమే వచ్చాయి. తర్వాత రోజురోజుకూ తగ్గుతూ వచ్చాయి. అయితే ధరలు పెరుగుతాయన్న ఆశతో రైతులు పత్తిని అమ్ముకుండా ఇండ్లల్లో నిల్వ చేశారు. తీరా ధరలు పెరగకపోవడంతో చివరకు తక్కువ రేటుకే అమ్ముకోవాల్సిన దుస్థితి తలెత్తింది. నిల్వ ఉంచితే ఇంకా పడిపోయే అవకాశం ఉన్నదని పలువురు రైతులు తక్కువ ధరలకే తెల్లబంగారాన్ని విక్రయిస్తున్నారు. ఈసారి అసలు ధరలే రావడం లేదు.

బాదేపల్లి మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన పత్తి

మద్దతు ధర ఎక్కడా..?

పత్తికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు కూడా రావడం లేదు. క్వింటాకు రూ.7,020 ధర నిర్ణయించినా కానీ మార్కెట్‌లో కనీస ధరలు కూడా దొరకని పరిస్థితి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తి సాగుకోసం చేసిన పెట్టుబడి ఖర్చులు సైతం వస్తాయా..? లేదా..? అన్న మీమాంస రైతుల్లో నెలకొన్నది. పత్తికి అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ లేకపోవడంతోనే ఆశించిన స్థాయిలో ధరలు దక్కడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. కర్ణాటక, రాయిచూర్, మహారాష్ట్ర సైతం పత్తి ఎగుమతి కావడం లేదని పేర్కొంటున్నారు.

రాష్ట్రస్థాయినె ట్‌బాల్ చాంపియన్‌గాని లిచినమ హబూబ్‌నగర్‌బా లుర జట్టు

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ చాంపియన్ మహబూబ్‌నగర్

మహబూబ్‌నగర్‌టౌన్, డిసెంబర్ 21 : రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో గురువారం నిర్వహించిన రాష్ట్రస్థాయి నెట్‌బాల్ టోర్నీలో ఉమ్మడి మహబూబ్‌నగర్ అండర్-14 బాలుర జట్టు చాంపియన్‌గా నిలువగా, అండర్-17 బాలుర జట్టు రన్నర్‌గా నిలిచింది. జిల్లా జట్టు విజేతగా నిలువడంపై ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రమేశ్‌బాబుతోపాటు క్రీడాకారులు, క్రీడాభిమానులు అభినందించారు.

సీఎంఆర్ వడ్లపై ఆరా..

- ప్రత్యేక బృందాలతో రహస్య విచారణ
- సమగ్ర నివేదికను అందజేయాలని ఆదేశాలు
- 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

గద్వాల అర్బన్, డిసెంబర్ 21 : సీఎంఆర్ వడ్ల సరఫరాలో మిల్లు నిర్వాహకులు పెద్ద మొత్తంలో అవినీతి చేయడంతో కేసులు నమోదు చేసి వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోడంపై అధికారులమీద తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. ఇదే విషయంపై గురువారం 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో 'కేసులు సరే.. రికవరీ ఏదీ..' అనే పేరుతో ప్రచురితనమైన కథనంపై అధికారులు స్పందించి రహస్యంగా విచారణ చేపట్టినట్లు తెలిసింది. సీఎంఆర్ వడ్లు 2021లో రైతుల నుంచి ఐకేపీ ద్వారా కొనుగోలు చేసి అనంతరం మిల్లులకు రీసైక్లింగ్‌కు తరలించిన అనంతరం వారి దగ్గర నుంచి బియ్యం పట్టించి ప్రభుత్వానికి అందజేయాలి. ఈ క్రమంలో కొంత మంది రైస్ మిల్లు నిర్వాహకులు ఇదే అదునుగా భావించి రైతుల నుంచి వచ్చిన వడ్లను కొంత మేర బియ్యం రీసైక్లింగ్ చేసి మరి కొంత వడ్లను అమాంతం నొక్కి భారీ మొత్తంలో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలు వచ్చాయి. ఈ అవకతవకలలో ప్రభుత్వ అధికారులకు కూడా భాగస్వాములుగా ఉన్నారని, వారిదే కీలకపాత్ర అంటూ ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. అయితే ఈ విషయంపై ఈ మధ్యనే జిల్లా అధికారుల సమీక్షలో మంత్రి జూపల్లి కృష్ణారావు పౌరసరఫరా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం విధితమే. జిల్లాలో రైతుల నుంచి వడ్లు తీసుకుంటున్న మిల్లులు ఏ మేరా.. బియ్యాన్ని ప్రభుత్వానికి అందజేశారో వివరాలు చెప్పాలని అధికారులను కోరగా అధికారులు నీళ్లు నమిలారు. మంత్రి ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు ఈ విషయంపై పోలీస్ అధికారులకు సమగ్ర నివేదికను ఇవ్వాలని ఆదేశించారు. పోలీస్ అధికారులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వడ్ల కొనుగోలు ఎప్పటి నుంచి మొదలైంది.. వానకాలం, యాసంగి రెండు దఫాలుగా ఏ మిల్లు ఎన్ని వడ్లు తీసుకొని తిరిగి ప్రభుత్వానికి ఎంత అందజేశారో అన్ని విషయాలను ఉన్నతాధికారుల నుంచి లెక్కలు తీసుకొని పూర్తి స్థాయిలో విచారణ చేపట్టారు. పోలీసులు విచారణ చేస్తున్నారన్న విషయం తెలుసుకున్న మిల్లు నిర్వాహకులు ఇప్పటికే పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నారు. సీఎంఆర్ వడ్లపై ప్రత్యేక బృందాల ద్వారా రహస్యంగా విచారణ చేపట్టి సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు అందజేయాలని, అక్రమాలకు పాల్పడి వారి దగ్గర నుంచి రికవరీ చేయాలని, అనంతరం వారి మీద కఠిన చర్యలు తీసుకునేందుకు పోలీస్ అధికారులు ఇప్పటికే ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలిసింది. ఈ క్రమంలో కొంత మంది పేర్లను పరిశీలించి విచారణ కూడా మొదలు పెట్టారు.

ఎవరినీ వదిలేది లేదు..

సీఎంఆర్ వడ్ల విషయంలో ఎవరినీ వదిలే ప్రసక్తి లేదు. ఈ విషయానికి సంబంధించి ఇప్పటికే జిల్లాలో కొన్ని కేసులు నమోదు చేశాం. అధికారుల లెక్కల ప్రకారం ఏ మిల్లు నిర్వాహకులు ఎన్ని వడ్లు తీసుకొని.. ఎంత బియ్యాన్ని ప్రభుత్వానికి ఇచ్చారో విషయాలపై ఆరా తీస్తున్నాం. ప్రత్యేక పోలీస్ అధికారులతో విచారణ చేపట్టాం. ఇందులో అవినీతికి పాల్పడిన వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటాం. బియ్యంను రికవరీ చేస్తాం.

–చెం కటేశ్వర్లు, డీఎస్పీ, గద్వాల

పరీక్ష రాయకుండా విద్యార్థుల ధర్నా

- ఎగ్జామ్ సెంటర్ మార్చాలని రెండో రోజూ నిరసన
- గంట ఆలస్యంగా ప్రారంభమైన పరీక్ష

మరికల్, డిసెంబర్ 21 : నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలోని సరస్వతి డిగ్రీ కళాశాల లో రెండో రోజూ విద్యార్థులు ధర్నా చేపట్టా రు. డిగ్రీ సెమిస్టర్ పరీక్షలకు హాజరుకాకుండా నిరసన తెలిపారు. మక్తల్ అయ్యప్ప డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులకు మరికల్ సరస్వతి డిగ్రీ కళాశాలలో ఎగ్జామ్ సెంటర్ నిర్వహిస్తున్నారు. అయితే, కేంద్రాన్ని మార్చాలని పరీక్షకు వెళ్లకుండా విద్యార్థులు గురువారం కూడా కళాశాల వద్ద ధర్నా చేశారు. పరీక్ష కేంద్రం మార్పు విషయమై పీయూ వీసీతో మాట్లాడామని పోలీసులు, కళాశాల యాజమాన్యం నచ్చజెప్పడంతో నిరసన విరమించారు. దీంతో గంట ఆలస్యంగా పరీక్ష ప్రారంభమైంది. రెండు రోజులుగా విద్యార్థులు నిరసన తెలుపడంతో కళాశాల యాజమాన్యం అసం తృప్తిని వ్యక్తం చేసింది.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఉమ్మడి జిల్లా జట్టు పయనం

గద్వాలటౌన్, డిసెంబర్ 21 : కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలంలో 23 నుంచి 26 వరకు నిర్వ హించే అం డర్- 17 బాలికల క్రికెట్ పోటీలకు ఉమ్మ డి జిల్లా జట్టు గురువారం పయనమైంది. జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో క్రీడాకారులకు డీవైఎస్‌వో ఆనంద్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ జితేందర్, పీడీలు శ్రీనివాసులు, నర్సింహారాజు, కోచ్ శ్రీనివాసులు శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి జిల్లా పేరును రాష్ట్ర స్థాయిలో నిలబెట్టాలని ఆకాక్షించారు.

అడుగంటిన ఆర్డీఎస్ ఆనకట్ట

అయిజ, డిసెంబర్ 21 : కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్ట అడుగంటుతున్నది. ఎగువ నుంచి ఇన్‌ఫ్లో పూర్తిగా నిలిచిపోవడంతో ఆనకట్టలో నీటి మట్టం క్రమేపీ తగ్గుతున్నది. ఆర్డీఎస్ ఆనకట్టకు ఇన్‌ఫ్లో నిలిచిపోగా గురువారం ఆర్డీఎస్ ప్రధానకాల్వకు నీటి విడుదలను నిలిపివేశారు. ప్రస్తుతం ఆనకట్టలో 3.7అడుగుల మేరనీటి నిల్వ ఉన్నట్లు ఆర్డీఎస్ ఏఈ రాందాస్ తెలిపారు. తుమ్మిళ్ల పథకం పంప్ ద్వారా నీటి విడుదల కొనసాగుతుందని పేర్కొన్నారు.

10 టీఎంసీలకు చేరిన టీబీ డ్యాం

కర్ణాటకలోని తుంగభద్ర డ్యాం నీటి నిల్వ 10.894 టీఎంసీలకు చేరుకున్నది. టీబీ డ్యాంకు ఇన్‌ఫ్లో నిలిచిపోగా, అవుట్‌ఫ్లో 640 క్యూసెక్కులు ఉన్నది. 105.788 టీఎంసీల పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం కలిగిన డ్యాంలో ప్రస్తుతం 10.894 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. 1,633 అడుగుల గరిష్ఠ నీటి మట్టానికి గానూ ప్రస్తుతం 1,589.84 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు డ్యాం సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.

ఆర్డీఎస్ఆ నకట్టలో ప్రస్తుత నీటి నిల్వ

జూరాలకు స్వల్ప వరద

ధరూరు, డిసెంబర్ 21 : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్ట్‌కు ఎగువ నుంచి స్వల్పంగా వరద కొనసాగుతున్నది. గురువారం ప్రాజెక్టుకు 517 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో నమోదు కాగా 66 క్యూసెక్కులు అవుట్‌ఫ్లో న మోదైంది. ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం 7.798 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 4.091 టీఎంసీల నీటిమట్టం ఉన్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

ఉత్సాహంగా దివ్యాంగుల క్రీడలు

వనపర్తి టౌన్, డిసెంబర్ 21 : వనపర్తి జిల్లా కేంద్రంలోని బాలకిష్టయ్య క్రీడా ప్రాంగణంలో గురువారం దివ్యాంగుల జిల్లాస్థాయి క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను అదనపు కలెక్టర్ సంకిత్‌గంగ్వార్ ముఖ్య అతిథిగా హాజరై జెండాఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు పరుగు పందెం, వీల్‌చైర్, చెస్, క్యారం, షాట్‌పుట్ క్రీడల ను పురుషులు, మహిళలకు వేర్వేరుగా నిర్వహించామన్నారు. ఈ క్రీడల వల్ల శారీరక, మానసిక ఉల్లాసం పెం పొందుతాయని వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో నర్సింహులు, వికలాంగుల సంక్షేమాధికారి రామమహేశ్వర్‌రెడ్డి, ఏపీడీ రేణుక, జిల్లా క్రీడల అధికారి సుధీర్‌రెడ్డి, పీఈటీలు శ్రీనివాసులు, శంకర్, శ్రీధర్‌బాబు, రామచంద్రమ్మ, ఈశ్వరమ్మ, రంగనాయకమ్మ,శిరీష, దివ్యాంగుల సంఘం నాయకులు మోహన్, ప్రభుస్వామి, చంద్రశేఖర్, వెంకటేశ్‌గౌడ్ ఉన్నారు.

క్రీడలను ప్రారంభిస్తున్న అదనపుకలెక్టర్‌స ంకిత్‌గంగ్వార్

అట్టహాసంగా..

- కడ్తాల్ మహాపిరమిడ్‌లో పత్రీజీ ధ్యాన మహాయాగం ప్రారంభం
- హాజరైన పత్రీజీ కుటుంబీకులు, ట్రస్ట్ సభ్యులు
- తరలివచ్చిన మాస్టర్లు, ధ్యానులు
- మహేశ్వర మహాపిరమిడ్‌తో ప్రపంచ గుర్తింపు
- ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి

పత్రీజీ ధ్యాన మహాయాగం ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ట్రస్టు చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి

కడ్తాల్, డిసెంబర్ 21 : మహేశ్వర మహా పిరమిడ్‌తో ఈ ప్రాంతానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించిందని, సుభాష్ పత్రీజీ కలలను సాకారం చేసేందుకు ప్రతి ధ్యాని కృషి చేయాలని పిరమిడ్ ట్రస్టు చైర్మన్ కోర్పోలు విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. కడ్తాల్ మండలంలోని అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలో గల కైలాసాపురి మహేశ్వర మహా పిరమిడ్‌లో గురువారం సాయంత్రం పత్రీజీ ధ్యాన మహాయాగం-2 ధ్యాన మహాసభలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పదకొండు రోజులపాటు జరిగే ధ్యాన మహాయాగం సభలను, పత్రీజీ కుమార్తెలు పరిమళ, పరిణీతతో కలిసి పిరమిడ్ ట్రస్టు సభ్యులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ధ్యానులనుద్దేశించి విజయభాస్కరెడ్డి మాట్లాడుతూ సుభాష్ పత్రీజీ ధ్యాన గురువని, ఆయన చూపిన ధ్యాన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని సూచించారు. ధ్యాన సభలకు వివిధ ప్రాంతాల నుంచి ధ్యానులు హాజరయ్యారు. ధ్యాన సభల ప్రారంభోత్సవం సందర్భంగా కళాకారుల నృత్యాలు విశేషంగా అలరించాయి. అంతకుముందు పత్రీజీ శక్తిస్థల్‌ని ట్రస్టు సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు సందర్శించారు. కార్యక్రమంలో పిరమిడ్ ట్రస్ట్ సభ్యులు సాంబశివరావు, దామోదర్‌రెడ్డి, రాంబాబు, హనుమంతురాజు, శివప్రసాద్, కృష్ణారెడ్డి, రాజశేఖర్, చంద్రశేఖర్, మాధవి, లక్ష్మి, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, అన్మాస్‌పల్లి సర్పంచ్ శంకర్‌తోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ధ్యానులు పాల్గొన్నారు.